ప్రజాశక్తి

శనివారం 29 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

నేడే గ్రేటర్ బడ్జెట్



బడ్జెట్ సమావేశానికి సిద్ధమైన హాలు

- ఆదాయం రూ.4279.61 కోట్లు
- అన్ని పద్దుల ఖర్చులు రూ.4601.40 కోట్లు
- ఇంజినీరింగ్ విభాగ పనులకు రూ.1319.45 కోట్లు
- వివిధ ప్రాజెక్టులకు రూ.808 కోట్లు
- కార్పొరేటర్లకు రూ.25 వేల విలువైన గిఫ్ట్ కూపన్లు
- తిరస్కరించిన సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) వార్షిక (2025-26) బడ్జెట్ సమావేశానికి అధికార యంత్రాంగం సమాయత్తమైంది. శనివారం ఉదయం 11 గంటలకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం ప్రారంభం కానుంది. జివిఎంసికి కమిషనర్ లేనందున జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సమావేశంలో పాల్గొననున్నారు. కేవలం అంకెలు, ఆదాయం, ఖర్చులు వంటివే గాకుండా ఈ బడ్జెట్ సమావేశానికి రాజకీయ ప్రాధాన్యత కూడా ఉండడం విశేషం. ఈ బడ్జెట్ మీట తర్వాత జరగబోయే కౌన్సిల్ సమావేశంలో కొత్తగా మేయర్‌ను, డిప్యూటీ మేయర్లనూ ఎన్నుకోనున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే పాత పాలకవర్గాన్ని రద్దు చేసేందుకు ఓటింగ్ జరుగనుంది. ఈ బడ్జెట్ సందర్భంగా ప్రతి కార్పొరేటర్‌కూ రూ.25 వేల విలువైన కూపన్‌లను ఇస్తున్నారు. ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి కార్పొరేటర్లు దాదాపు తీసుకున్నట్టు సమాచారం. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఈ కూపన్‌ల సంస్కృతిని, ప్రజల డబ్బును ఇలా పంచడాన్ని తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. గిఫ్ట్ కూపన్లను జివిఎంసికి వాపస్ ఇచ్చేశారు.

బడ్జెట్ ఎలా ఉండనుంది ?

అన్ని పద్దుల కింద జమలు రూ.4279.61 కోట్లు కాగా ప్రారంభ నిల్వ రూ.482.26 కోట్లు ఉంది. దీంతో కలిపి రూ.4761.87 కోట్లు. అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.4601.40 కోట్లు. ముగింపు నిల్వ రూ.160.47 కోట్లుగా ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇంజినీరింగ్ పనులకు సుమారు రూ.1319.45 కోట్లు మిగతా 2లో..

వార్తలు 8లో..

అనకాపల్లిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసనలు

మల్కాపురంలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

విశాఖలో బిల్లుల దహనం, అనకాపల్లిలో రాస్తారోకో

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె విజయవంతం

వార్త మెయిన్‌లో..

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

లోకనాథం, శంకరరావు

వార్త 5లో..

వడ్లపూడిలో ప్రేమికుల ఆత్మహత్య

వార్త 8లో..



విశాఖ పోర్టు

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 91 ఏళ్ల ప్రస్థానంలో విశాఖపట్నం పోర్టు మరో చారిత్రక మైలురాయిని అధిగమించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 361 రోజుల్లోనే ఇప్పటి వరకు అత్యధిక సరుకును రవాణా చేసిన ఘనతను నమోదు చేసింది. 27 మార్చి 2025 నాటికి పోర్టు 81.28 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును హ్యాండ్లింగ్ చేసి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 366 రోజుల్లో సాధించిన 81.09 మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించిందని పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. పోర్టు సరికొత్త రికార్డుకు దోహదపడిన సిబ్బంది అందరినీ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు.

సుజల స్రవంతిపై కూటమి కొత్త వ్యూహం

- భూ సేకరణ జరపకుండానే పనులకు సిద్ధపడుతున్నట్టు హడావుడి
- నదుల అనుసంధానం పేరుతో కేంద్ర సాయంపై ఆశలు
- ప్రజలను బోల్తా కొట్టించే పనిలో ప్రభుత్వం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజలను బోల్తా కొట్టించడానికి పూనుకుంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూ సేకరణ జరపకుండానే పనులకు సిద్ధపడుతోంది. గతంలో పిలిచిన టెండర్లకు జీవం పోయాలని చూస్తోంది. 2018లో ఫేజ్-1, 2021లో ఫేజ్-2 టెండర్లు పిలిచినా ప్రభుత్వాలు నిధులు విడుదల చేయని విషయం తెలిసిందే. ఈ సారి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులొస్తాయన్న ఆశతో నదుల అనుసంధానాన్ని కొత్తగా చేర్చి పనుల పేరిట హడావుడి చేస్తోంది. వాస్తవానికి బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి (బిజెఆర్‌యుఎస్‌ఎస్) ప్రాజెక్టుకు 2025-26 బడ్జెట్లో రూ.605.75 కోట్లు మాత్రమే కేటాయించారు. అవి ఎటూ చాలనప్పటికీ రూ.6,358 కోట్లు అవసరమైన సుజల స్రవంతి ప్రాజెక్టు భూ సేకరణ, ప్రధాన కాలువ పనులను మూడేళ్లలో పూర్తిచేస్తామని కూటమి ప్రభుత్వం నమ్మబలుకుతోంది. ఇంతవరకూ ఎకరా భూమి సేకరించకుండానే 2025 డిసెంబరు నాటికి విశాఖపట్నం పరిశ్రమలకు నీరు సరఫరా చేసేలా జలవనరుల శాఖాధికారులతో చిత్తుప్రతిని తయారు చేయించింది.

తొలుత ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తాళ్లపాలెం నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లా గుర్ల మండలం గడిగెడ్డ రిజర్వాయర్ వరకు 101.57 కిలోమీటర్లలో ప్రధాన కాలువ నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పనుల కోసం 6,403 ఎకరాల భూమి సేకరించాల్సివుంది. కానీ ఇంతవరకు ఎకరం భూమిని కూడా సేకరించే ప్రక్రియను ప్రభుత్వం పూర్తిచేయలేదు. భూ సేకరణకు ప్రస్తుత అంచనా ప్రకారం రూ.2,577 కోట్లు, ప్రధాన కాలువ నిర్మాణ పనులకు రూ.3781 కోట్లు వ్యయం కానుంది. ఈ తీరున ఇటీవల విడుదల చేసిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేదు. భూమి సేకరించకుండా గతంలో పిలిచిన టెండర్లకు కొత్తగా అనుసంధాన రూపమిచ్చి పనులు చేయాలనుకుంటోంది. కాలువ నిర్మాణ పనులు జరగడానికి ముందు భూ సేకరణ ప్రక్రియ పూర్తిచేయాల్సివుంది. పనులకు టెండర్లు పిలిచి ఖరారైన తరువాత కాంట్రాక్టర్లకు భూమి అప్పగించాల్సివుంది. ప్రభుత్వం ఈ పనిచేయకుండా, తన చేతిలో ఎకరా భూమి కూడా లేకుండా మూడు ప్యాకేజీల కింద రూ.3,781 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచింది. నిర్మాణ పనులకు నిధులు కేటాయించడానికి చేతులురాని ప్రభుత్వం... నదుల అనుసంధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు రాబట్టవచ్చన్న ఆశతో వుంది. సుజల స్రవంతి 101.57 కిలోమీటర్ల ప్రధాన కాలువ నిర్మాణంలో శారద, గోస్తని, చంపావతి నదుల అనుసంధానం పనులను జోడించింది.

రూ.17,050.20 కోట్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నేడే గ్రేటర్ బడ్జెట్

బడ్జెట్‌లో చూపారు. జివిఎంసి ఆధ్వర్యాన జరగాల్సిన వివిధ ప్రాజెక్టులకు రూ.808.14 కోట్లు కేటాయించారు. సాధారణ పద్దుల కింద రూ.158.02 కోట్లు, లైటింగ్‌కు రూ.116.15 కోట్లు, ప్లానింగ్‌కు రూ.31.99 కోట్లు, యుసిడికి రూ.27.54 కోట్లు, విద్యకు రూ.4.70 కోట్లు, పార్కులు, లీజులు, సిమెటరీస్‌కు రూ.84.60 కోట్లు, ప్రజారోగ్యానికి రూ.459.49 కోట్లు, మంచినీటి సరఫరాకు రూ.338.93 కోట్లను కేటాయించారు. దీంట్లో అమృత్ పథకానికి రూ.31 కోట్లు కేటాయించారు. ఇతర నిధులతో ప్రాజెక్టులు రూ.148 కోట్లు, ఆర్థిక సంఘం నిధులు రూ.453.19 కోట్లు, డిపాజిట్‌లు, అడ్వాన్స్‌లు రూ.341.19 కోట్లు.. ప్రారంభ నిల్వతో కలుపుకుని మొత్తం రూ.4601.40 కోట్లు కేటాయింపులు చేపట్టారు.

సుజల స్రవంతిపై కూటమి కొత్త వ్యూహం

విలువైన బిజెఆర్‌యుఎస్‌ఎస్ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు లభించనుంది. విశాఖ నగర ప్రజలకు, 48 మండలాల్లోని 1037 గ్రామాల్లోని 30 లక్షల మందికి తాగునీరు, పరిశ్రమలకు సరిపడా నీరు లభ్యం కానుంది. ఇంత విలువైన ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించకుండా కేంద్ర సాయంతో ప్రధాన కాలువను పూర్తి చేయాలని చేసిన కూటమి వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాలి. కేంద్రం నిధులు ఇవ్వకపోతే సుజల స్రవంతి పనులు ప్రశ్నార్థకంగా మారనున్నాయి.

పోరాట ఫలితమే 'సహకార్ ట్యాక్సీ'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓలా, ఉబర్, రాపిడో డ్రైవర్ల పోరాటం కారణంగానే కేంద్ర ప్రభుత్వం 'సహకార్ ట్యాక్సీ'ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిందని విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్ అన్నారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉబర్, ఓలా, రాపిడో మొదలైన వాటికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఒక యాప్‌ను ప్రారంభిస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటనను తమ యూనియన్ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత యాప్‌తో డ్రైవర్లు, ప్రయాణికుల కష్టాలను, లోపాలను పరిష్కరించాలన్నారు. గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పోల్‌నాయుడు, నాయకులు ఆనంద్, సుంకర అబ్బాయి, రామోను ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం మీడియా కమిషన్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది నామ సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంజనేయులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, అలాగే అనేక ప్రాంతాల్లో హత్యలు జరుగుతున్నాయని ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు మీడియా కమిషన్ ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ డికె బారువ, ఎసిఎ మీడియా మేనేజర్ జై కిషన్, ప్రముఖ సంఘ సేవకులు మట్టపల్లి హనుమంతరావు, శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు పాల్గొని మాట్లాడారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కె.మదన్, జగన్ మోహన్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. పలువురు జర్నలిస్టుల పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహిళలకు చీరలు, పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు.

జర్నలిస్ట్ ధ్రువతార మానికొండ

భారతీయ జర్నలిజంలో మానికొండ చలపతిరావు ధ్రువతారగా నిలిచారని ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ ఆచార్యులు బాబి వర్ధన్ కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు ఆకుల అమరయ్య రచించిన మానికొండ చలపతిరావు పుస్తకాన్ని ఆయన జర్నలిస్టుల ఉగాది సంబరాల్లో ఆవిష్కరించారు.

కాంట్రాక్టర్ల దోపిడీకి టెండర్ల విధాన లోపమే కారణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాంట్రాక్టర్ల దోపిడీకి టెండర్ల విధాన లోపమే కారణమని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకట్ రెడ్డి అన్నారు. ఎంఎ, యుడి సర్క్యులర్లు, గైడ్‌లైన్స్, చట్టవిరుద్ధంగా జివిఎంసిలో పిఎఫ్, ఇఎస్‌ఐలు కలపకుండా ఎస్టిమేషన్లు వేసి టెండర్లు పిలుస్తూ కౌన్సిల్‌ను తప్పుదారి పట్టిస్తూ ఆమోదిస్తున్నారని, కార్మిక వివాదాలు రావడానికి ఇదే కారణమని పేర్కొన్నారు. ఎస్టిమేషన్లను రివైజ్ చేసి సరి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.అనిల్ కుమార్, లోహియా కాంట్రాక్టు నాయకులు రమణ, శ్రీను, యశ్వంత్ పాల్గొన్నారు.

విశాఖను అగ్రస్థానంలో నిలపండి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర సాకారంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, అధికారులు సమిష్టి కృషి చేసి విశాఖ జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రజలకు సంతృప్తికర రీతిలో సేవలందించాలన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మూడో విడత కలెక్టర్ల సదస్సు అంశాలను శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమావేశంలో జిల్లా అధికారులకు వివరించిన ఆయన పలు అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. అన్ని రంగాల్లో విశాఖ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యంగా బాధ్యతగా పని చేయాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర - 2047 విజన్ ప్లాన్, విశాఖపట్నం 2025-29 ప్లాన్ ప్రాతిపదికగా ముందుకు సాగాలని ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని, కొత్త హోటళ్లు, రిసార్టులు ఏర్పాటు చేసేందుకు సహకారం అందించాలని అన్నారు. రుషికొండ, గంభీరంలో అడ్వెంచర్ స్పోర్ట్స్ కాంప్లెక్సులు నిర్మించాలని సూచించారు. విఎంఆర్‌డిఎ, జివిఎంసి పరిధిలో చేపట్టే ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, అనుమతుల జారీ విషయంలో పారదర్శకత పాటించాలని, వేగం పెంచాలని సూచించారు. 15 శాతం వృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, తలసరి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. గ్రామీణ మండలాల్లో వ్యవసాయంపై ప్రధాన దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఉద్యాన, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్ఫలితాలు సాధించాలన్నారు. వచ్చే ఏడాదికి 200 హెక్టార్ల బీడు భూములను సాగులోకి తీసుకురావాలని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, నగరంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరు నెలల్లో మెట్రో భూసేకరణకు చర్యలు

విశాఖలో చేపట్టనున్న మెట్రో రైలు ప్రాజెక్టు అవసరాల నిమిత్తం ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఆరు నెలల్లో మొదటి దశ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించి కార్యాచరణ మొదలు పెట్టాలని, అంతర్గత రోడ్ల విషయంలో వేగం పెంచాలని సూచించారు. మెట్రో ప్రాజెక్టు, మాస్టర్ ప్లాన్ రోడ్డు వేసే మార్గంలో కొత్తగా ఎలాంటి అనుమతులూ ఇవ్వరాదని, కొత్త భవనాలు, లేఅవుట్లు వేసేందుకు ప్రణాళికలు తయారు చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైల్వే స్టేషన్ నుంచి, బస్ స్టేషన్ నుంచి అనుసంధానమయ్యే రోడ్ల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులు కర్మయోగి సర్టిఫికెట్ కోర్సులు చేయాలని, పి-4 సర్వేకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వాట్సాప్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ సేవలను మరింత విస్తృతం చేయాలని, సంబంధిత నెంబర్‌ను పబ్లిక్ ప్రాంతాల్లో ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్ పాల్గొన్నారు.

కరూర్ వైశ్య బ్యాంక్ శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కరూర్ వైశ్య బ్యాంక్ (కెవిబి) నగరంలోని పూర్ణా మార్కెట్ మెయిన్ రోడ్డులో తమ నూతన శాఖను ఏర్పాటు చేసింది. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ సంధ్యా దేవి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ కొత్త శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెవిబి నూతన శాఖ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత వాసులకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. దగ్గరలో బ్యాంకు ఉండడం వల్ల ప్రజలకు సమయం ఆదా అవ్వడంతో పాటు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఈ శాఖ పొదుపు, కరెంట్ ఖాతాలు సహ డిపాజిట్లు, రుణాలు వంటి సమగ్రమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తుందని బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు.

బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టర్ : దేశంలో 52 శాతం జనాభా కలిగిఉన్న బిసిలకు ప్రత్యేకంగా కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అఖిలభారత ఒబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు తులసపాటి కృష్ణంరాజు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

ఎంవిపి.కాలనీ : వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ అధికారులు పలు రైళ్లకు అదనపు కోచ్‌లను పెంచాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 58506 విశాఖపట్నం - గుణుపూర్ ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్‌కు, 58505 గుణుపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30 వరకు, 58501 విశాఖపట్నం - కిరండూల్ ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 12 నుండి ఏప్రిల్ 30 వరకు, 58502 కిరండూల్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 13 నుండి మే 1 వరకూ, 20809 సంబల్‌పూర్ - నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 4 నుండి ఏప్రిల్ 28 వరకు, 20810 నాందేడ్ - సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఏప్రిల్ 5 నుంచి 29 వరకు ఒక అదనపు స్లీపర్ కోచ్‌ను పెంచనున్నారు.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 1330 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer,
...Plaintiff

And

Sri.N.Rama Rao,,
...Defendant

To
Sri.N.Rama Rao, S/o. Late.N.Naga Raju, Aged about 57 Years, Occ: Business, R/o. H.No. 14-1-15/31, Flat No 4/8, Nowroji Road, Sri Daspalla Towers, Visakhapatnam-530002.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,65,109-66ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 02-05-2025.

In case of your failure to attend before the Court on 02-05-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE VIII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 1522 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad,rep.by its Sr.Manager(Law)&Authorized Officer,
...Plaintiff

And

Sri.Ch.Venkata Ramana
...Defendant

To
Sri.Ch.Venkata Ramana, S/o. Lingamurthy, Aged about 63 Years, Occ: Business, R/o. H.No.38-36-70/1/3, Siva Nagar, Marripalem, Visakhapatnam, A.P-530008

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,16,130-60ps to wards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 01-05-2025.

In case of your failure to attend before the Court on 01-05-2025 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,

గ్రామ పంచాయితీ కార్యాలయం - గంభీరం

రేఖానెం. 18/24 — **టెండరు ప్రకటన** — తేదీ.28-03-2025

విశాఖ జిల్లా, ఆనందపురం మండలం, గంభీరం గ్రామ పంచాయితీ 2025-26 సంవత్సరమునకు పంచాయితీ ఏరియాలో ప్రజారోగ్య శానిటేషన్ పనులకు కాంట్రాక్టు పద్ధతిపై మనుష్యులు సప్లయికి వాటరు సప్లయి నిర్వహణ, వీధి దీపములు నిర్వహణకు యితర వగైరా పనులకు మనుష్యులు సప్లయి చేయుటకున్నూ ప్రజారోగ్య సామాన్యు సప్లయికి వాటరు సప్లయి సామానుకు, ఎలక్ట్రికల్ సామాన్లు సప్లయికి తే: 01-04-2025 ఉదయం 11-30 గంటలకు సీల్డు టెండర్లు ఈ దిగువ సంతకం దారునిచే కోరబడుచున్నవి. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 1.00 గంటలకు సదరు టెండర్లు టెండరుదార్ల సమక్షమున, ఈ దిగువ సంతకందారు వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరువబడును. టెండరుదాఖలు చేయు వారు ముందుగా కార్యాలయమునకు వచ్చి వివరములు తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

క్రస	సప్లయి వివరములు	చెల్లించినవలసిన ధరావత్తు	సప్లయి పరిమితి	రిమార్కుల
1.	పంచాయితీ ఏరియాలో పారిశుధ్యపు పనులు నిర్వహణకు 2025-26 సంవత్సరమునకు కాంట్రాక్టు పద్ధతిపై మనుష్యులు సప్లయికి	రూ. 500/-	ఒక సం॥ కాలము సప్లయి. 3	
2.	పంచాయితీ ఏరియాలో వాటరు సప్లయి నిర్వహణకు 2025-26 సంవత్సరమునకు కాంట్రాక్టు పద్ధతిపై మనుష్యులు సప్లయికి	రూ. 200/-	-డిటో-	
3.	పంచాయితీ ఏరియాలో వీధి దీపముల నిర్వహణకు 2025-26 సంవత్సరమునకు కాంట్రాక్టు పద్ధతిపై మనుష్యులు సప్లయికి	రూ. 200/-	-డిటో-	
4.	పంచాయితీ ట్రాక్టరుకు (డ్రైవర్) 2025-26 2025-26 సంవత్సరమునకు కాంట్రాక్టు పద్ధతిపై మనుష్యులు సప్లయికి	రూ. 200/-	-డిటో-	
5.	ప్రజారోగ్య మందులు సప్లయికి 2025-26 సంవత్సరమునకు సప్లయి చేయుటకు.	రూ. 200/-	-డిటో-	
6.	వాటరు సప్లయి సామాన్లు 2025-26 సంవత్సరమునకు సప్లయి చేయుటకు.	రూ. 300/-	-డిటో-	
7.	2025-26 సంవత్సరమునకు ఎలక్ట్రికల్ సామాన్లు సప్లయి చేయుటకు	రూ. 500/-	-డిటో-	
8.	2025-26 సంవత్సరమునకు స్టేషనరీ సామాన్లు సప్లయి చేయుటకు	రూ. 100/-	-డిటో-	

గమనిక : ఐటమ్ నెంబర్లు 5,6,7 కొరకు విడివిడిగా రేట్లు కోట్ చేయవలెను.
షెడ్యూల్ -2లో తెలిపిన సామాన్లుకు మాత్రమే టెండరు దాఖలు చేయవలెను.

సం/- కె.చలపతిరావు, పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ, గంభీరం

ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు

ఓటింగ్‌లో పాల్గొన్న న్యాయవాదులు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో 2958 మంది ఓటర్లుండగా, నిర్దేశిత సమయంలోగా 2306 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 77.96శాతం పోలింగ్ నమోదైంది. శుక్రవారం ఉదయం పది గంటలకు మొదట మందకొడిగా పోలింగ్ సాగినప్పటికీ, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఊపందుకుంది. సాయంత్రం 4.30గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సీనియర్ న్యాయవాదులు పలువురు పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరికోసం కిందన ఆడిటోరియంలో ప్రత్యేకంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయగా, మిగతా నాలుగు పోలింగ్ బూత్‌లను బార్ అసోసియేషన్ హాల్, లైబ్రరీలో ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపును వెంటనే ఏడు గంటల నుంచి చేపట్టి, వెంటనే ఫలితాలను వెల్లడిస్తామని ఎన్నికల అధికారి జీఎం రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- సీతమ్మధార : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధిత లబ్ధిదారులకు ఉత్తర ఎమ్మెల్యే పి విష్ణుకుమార్‌రాజు అందజేశారు. శుక్రవారం నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని బిజెపి కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు వార్డుల లబ్ధిదారులకు రూ. 53,330 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరోగులకు ఎన్‌టిఆర్ భరోసాతో ఉచిత వైద్యానికి అర్హత లేని వ్యాధులకు ఆసుపత్రి బిల్లులతో దరఖాస్తు చేసుకుంటే సిఎం సహాయనిధి నుంచి సాయం అందుతుందన్నారు. టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నజీరు, ఉత్తర నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, కూటమి పార్టీల అధ్యక్షులు, నేతలు పాల్గొన్నారు

మహిళ వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- భీమునిపట్నం : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఏడాదిగా చికిత్స పొందుతున్న జివిఎంసి మూడో వార్డు నేరెళ్లవలస కాలనీకి చెందిన మహిళ కిరణ్మయికి వైద్య సహాయం నిమిత్తం స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం రూ.20 వేలు సాయం అందజేశారు. బాధితురాలి తండ్రి ప్రభాకర్‌కు సాయం అందించినట్లు సంస్థ సభ్యులు కళ్ల సన్నీ, ఎం సూర్య శ్రీనివాస్ తెలిపారు. సంస్థ సభ్యులు జి.సాయి, ఎం.శ్రీరామ్, ఎం.గోపి పాల్గొన్నారు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బంటుపల్లి గ్రామపంచాయతీ బిపి కల్లాలు రోడ్డులో సూర్య సప్లయర్స్ అధినేత నర్సింగరావు, తన స్నేహితులు ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, బాటసారులకు వేసవిలో దాహార్తిని తీర్చాలనే ఉద్దేశ్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉగాది రోజు నుంచి చలివేంద్రంలో మజ్జిగ కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సూర్య సప్లయర్స్ అధినేత మీసాల నరసింగరావు, వైండింగ్ లక్ష్మణ్, పల్లి శంకర్ కోన శ్రీను, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

టెన్త్ జీవశాస్త్రం పరీక్షకు 99.4 శాతం హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : శుక్రవారం జరిగిన పదోతరగతి జీవశాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 99.4 శాతం విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. జిల్లాలో 29,405 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా 29, 233 మంది హాజరయ్యారు. 172 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. 15 కేంద్రాల్లో ఎన్ఐఎస్ ఓపెన్ స్కూలు విద్యార్థులకు సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్ష నిర్వహించగా, 727 మంది విద్యార్థులకు గాను 648 మంది హాజరయ్యారు. 79 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు.. జిల్లా అబ్జర్వర్ దేవానంద రెడ్డి నాలుగు కేంద్రాలు, తాను 5 పరీక్షా కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 26 కేంద్రాలను తనిఖీ చేసినట్లు డిఇఒ తెలిపారు.

'అవంతి'లో ఘనంగా జాతీయ యువజనోత్సవాలు

బహుమతులు అందజేస్తున్న ముత్తంశెట్టి, అతిథులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 'అవెన్సిస్ 2కె25' పేరిట రెండ్రోజుల పాటు జరగనున్న జాతీయ యువజనోత్సవాలు శుక్రవారం ఉల్లాసంగా ప్రారంభమ య్యాయి. ఈ ఉత్సవాలను కృష్ణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె రాంజీ, ఇండియన్ వెయిట్ లిఫ్టర్, అర్జున్ అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మితో కలిసి అవంతి విద్యాసంస్థల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడ, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని సూచించారు.వ్యవసాయ, పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి వేగవంతమవుతోందని, ఏ రంగంలోనైనా సాంకేతిక పరిజ్ఞానం యావత్తూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వైపు అడుగులు వేస్తుందన్నారు. ముఖ్య అతిథి కృష్ణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె రాంజీ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రతి ఒక్కరూ ఎంచుకున్న రంగంలో నైపుణ్యం సాధించాలని కోరారు. వెయిట్ లిఫ్టర్ నీలంశెట్టి లక్ష్మి మాట్లాడుతూ, క్రీడల్లో రాణించే వారికి మంచిపేరుతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విశాఖ అజినో మోటో బయోఫార్మా సర్వీసెస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సిహెచ్ ఆదిత్య కిరణ్ మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్స్ బి మురళీకృష్ణ, ఎంబి వెంకటపతిరాజు, పి రామకృష్ణ, బి జగదీశ్వరరావు, ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ షరీఫ్, డాక్టర్ అనంతరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు. సినీ నేపథ్య గాయకులు శ్రీకృష్ణ, ఉమ, నేహలు హుషారైన పాటలతో ఉర్రూతలూగించారు బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, క్రికెట్, టేబుల్ టెన్నిస్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు

పరిశోధనలు సమాజ హితానికి దోహదపడాలి

కృష్ణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంజీ

ప్రజాశక్తి -తగరపువలస :పరిశోధనలు మానవాళికి, సమాజ హితానికి దోహదపడాలని మచిలీపట్నం శ్రీకృష్ణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె రాంజీ అన్నారు. శుక్రవారం స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో డిజైన్ ఇన్నోవేషన్స్ అండ్ ఎనర్జీ సిస్టం ఆప్టిమైజేషన్ ఫర్ ఇండస్ట్రియల్ అప్లికేషన్స్ అనే అంశం పై రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాంజీ మాట్లాడుతూ వినూత్న ఆవిష్కరణలతో యువత ముందుకు వెళ్లాలని కోరారు.ఈ తరహా సదస్సు అధ్యాపకులకు, విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు.మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి నాగరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రిన్సిపాల్ కె. శ్రీరామకృష్ణ, సదస్సు కో ఆర్డినేటర్లు డాక్టర్ లెనిన్, డాక్టర్ వినోద్‌బాబు పాల్గొన్నారు.

'హెచ్‌పివిపి'లోనూ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలి

భెల్ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి-గాజువాక : భెల్, హెచ్‌పివిపి యూనిట్‌లో హయ్యర్ పెన్షన్ విధానం అమలు చేయాలని, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ సాహూ అన్నారు. శుక్రవారం హయ్యర్ పెన్షన్ అమలు, ఇపిఎస్95 పెన్షనర్ల సమస్యలపై యాజమాన్యంతో గుర్తింపు యూనియన్ నేతలు, రిటైర్డ్ ఉద్యోగులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సాహూ మాట్లాడుతూ, ఇతర ప్రభుత్వరంగ సంస్థల మాదిరిగానే భెల్‌లోని హెచ్‌పివిపి ఇపిఎస్ 95 విశ్రాంత ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అమలు చేయాల్సి ఉండగా, యాజమాన్యం తిరస్కరణలో హెచ్‌పివిపి పెన్షనర్లకు అమలు కావడం లేదన్నారు. హైదరాబాద్ యూనిట్‌లో కొంతమందికి హయ్యర్ పెన్షన్ అమలు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూనే, దాన్ని విశాఖ యూనిట్ పెన్షనర్లకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై భెల్‌యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు సాహూ వెల్లడించారు. కార్యక్రమంలో ఉన్నత యాజమాన్యం తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. సుబ్రహ్మణ్యం, జనరల్ మేనేజర్ ఆపరేషన్ సెక్షన్ జి చంద్రశేఖర్, గుర్తింపు యూనియన్ నాయకులు పివిఎన్‌రాజు, కొల్లి దేముడు, టెక్కలి భాస్కర రావు, పి వీరబాబు, బి రవీంద్రబాబు, వి. గోవిందరావు, పెన్షనర్లు అబ్దుల్లా, అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రవీణ్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి

పద్మనాభంలో నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు

ప్రజాశక్తి -పద్మనాభం : రాజమండ్రిలో క్రైస్తవ బోధకుడు పగడాల ప్రవీణ్ ప్రగడ హత్య కేసులో సమగ్ర విచారణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని మండలంలోని పాస్టర్లు కోరారు.శుక్రవారం పాస్టర్ ప్రవీణ్ హత్యకు నిరసనగా మండల కాంప్లెక్స్ ప్రాంగణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట పద్మనాభం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తహశీల్దార్ ఆనందకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రవీణ్ హత్య జరిగి నాలుగు రోజులు కావస్తున్నా కేసులో ఎటువంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, నిందితులెవరో బయటపెట్టి, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేసును నీరుగార్చాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా పాస్టర్లంతా ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో జాన్ విక్టర్, డేవిడ్, పద్మకుమార్, అబ్రహం పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వడ్లపూడిలో ప్రేమికుల ఆత్మహత్య

ఉరేసుకుని చనిపోయిన జంట

ప్రజాశక్తి-ఉక్కునగరం : వడ్లపూడి ఆర్‌హెచ్.కాలనీలో ప్రేమజంట ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. మృతుడి ని మర్రిపాలేనికి చెందిన అమీరుద్దీన్‌ఖాన్ (36)గా, మృతురాలిని సింహాచలం గోశాలకు చెందిన పిన్నింటి వెంకటదుర్గ (17)గా గుర్తించారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మర్రిపాలేనికి చెందిన మృతుడు అమిరుద్దీన్ ఖాన్ సింహాచలం గోశాల వద్ద మృతురాలు తల్లి జయశ్రీ నడుపుతున్న హోటల్లో చెఫ్‌గా పనిచేసేవాడు. అమీరుద్దీన్‌ఖాన్ ప్రవర్తన బాగా లేని కారణంగా మృతురాలి తల్లి అతనిని పని నుంచి తొలగించింది. అప్పటికే మృతులిద్దరి మధ్య ప్రేమ పరిచయం ఉండడంతో తర్వాత కూడా వారు కలుసుకునే వారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం మృతురాలి తల్లి జయశ్రీ హోటల్‌కు వెళ్లగానే, వెంకట దుర్గ చీరలు తెచ్చుకోవడానికి బయటకు వెళ్ళిపోయింది. అనుమానం వచ్చిన తల్లి జయశ్రీ, అమీరుద్దీన్ ఖాన్ కోసం వాకబు చేసి, వడ్లపూడిలో అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చింది. గది తలుపుకు లోపల గడియ పెట్టి ఉండడంతో కిటికీల్లోంచి లోపలికి చూడా, ఇద్దరూ ఉరేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి తల్లి జయశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అమీరుద్దీన్ ఖాన్‌కు గతంలోనే వివాహం కాగా, నెల రోజుల క్రితమే విడాకులు తీసుకున్నాడు. మృతురాలు పిన్నింటి వెంకటదుర్గ ఇంటర్ ఫస్టియర్ పూర్తిచేసింది.

మనస్తాపంతో యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి- సీతమ్మధార : పనికి వెళ్లడం లేదని మందలించడంతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాలివి. చెన్నూరు మసీదు వద్ద కె.పద్మ కుటుంబంతో నివాసముంటోంది. తన చిన్న కుమారుడు ప్రతాప్ (23) ఏ పనికీ వెళ్లకుండా ఖాళీగా ఉంటున్నాడని ఆమె అన్నయ్య కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ప్రతాప్, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరకట్న హత్యకేసులో నిందితునికి జీవితఖైదు

రూ.మూడు లక్షల జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం: వరకట్న వేధింపులు, హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదుతోపాటు రూ. 3 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం గాజువాక 13వ అదనపు కోర్టు న్యాయమూర్తి జి.షణ్ముఖరావు తీర్పునిచ్చినట్లు స్థానిక సిఐ చింతా వాసునాయుడు తెలిపారు. వివరాలివి. మద్యానికి బానిసైన భర్త సోమునాయుడు (41) వరకట్న వేధింపులకు తాళలేక ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో దబ్బంద గ్రామానికి చెందిన పాపాన సోమేశ్వరి అలియాస్ ధర్మావతి మనస్తాపంతో 2012లో ఆత్మహత్య చేసుకుంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు మృతురాలి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేశారు. కోర్టులో నేరాభియోగ పత్రాలను దాఖలు చేయగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.పావని వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితునికి జీవితఖైదుతోపాటు రూ.మూడు లక్షల జరిమానా విధిస్తూ గాజువాక 13వ అదనపు మేరకు జడ్జి తీర్పునిచ్చారు కేసులో విచారణలో చురుకుగా పాల్గొన్న ఆనందపురం ఎస్ఐ సత్యనారాయణ, పిసి ఈశ్వరరావులను సిఐ అభినందించారు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం :పెద్దిపాలెం విద్యుత్ లైన్ నిర్వహణ మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 29న శనివారం ఉదయం 9.గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఎఇఇ సురేష్ కుమార్ తెలిపారు. చందక, పోడుగుపాలెం వెంకటాపురం, జగన్నాధపురం, గొట్టిపల్లి, కుసులవాడ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -ములగాడ : ప్రజాచైతన్య యాత్రలో గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి పోరాటం చేస్తామని సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. శుక్రవారం సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా జివిఎంసి 59వవార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో ఇంటింటా పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిపట్టాలు, ఇళ్లు మంజూరు, ఉచిత గ్యాస్ డబ్బులు ఖాతాల్లో జమ కావడం లేదని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు మంజూరు చేయాలని, ఇతర సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా కాలనీలో పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, పిల్లలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఉందని,వాటి అరుపులతో రాత్రి వేళల్లో నిద్రపట్టడం లేదని స్థానికులు వాపోయారు. దీనిపై జివిఎంసి అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు బూడి.శ్రీను, ఎల్.రాంబాబు జె.రామునాయుడు, పైడినాయుడు, ఎం.శ్రీను రామకృష్ణ, ప్రశాంత్, కె.రమణ సూరిబాబు, బి.రాంబాబు పాల్గొన్నారు.

లయన్స్ కేన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి నిధులు

నిధులు అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : స్థానిక లయన్స్ కేన్సర్ జనరల్ ఆసుపత్రిలో అధునాతన సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులకు రూ.3.80లక్షల నిధులను కేటాయించినట్లు ఆసుపత్రి ట్రస్టీ వెలగపూడి ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిని డాక్టర్ సిఎస్ఎస్ విశ్వతేజ, లయన్ సిఎస్ఎస్‌పి కృష్ణారావు సందర్శించి, అందుతున్న సేవలు, ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించారు. మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి ఉమా మహేశ్వరరావు, జిల్లా గవర్నర్ లయన్ ప్రొఫెసర్ ఎన్‌బిఎస్ఎస్ ప్రసాద్ సమక్షంలో, ఆసుపత్రిలో ఐసియులో అధునాతన సౌకర్యాల కోసం విరాళం అందజేసినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సౌకర్యవంతమైన సేవలు అందిస్తామని, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి ఉమామహేశ్వరరావు తెలిపారు. లయన్ డి సూర్యప్రకాష్, డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ బి.సింహం సభ్యులు జిఎన్ మాంగరాజు (బాబ్జి), ఎపిఎస్. మూర్తి, జ్యోతిష శాస్త్ర శాస్త్రవేత్త ఎస్.రవిప్రకాష్, గణేష్ బహదూర్ పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే పల్లా

రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా, కూటమి నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు వడ్లపూడిలో మజీద్ ఈ అహ్లే హదీస్‌లో రంజాన్ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజాన్ ప్రార్థనల్లో పాల్గొని, ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ద్వారా ముస్లిములు సమైక్యతను చాటుతూ ప్రజలకు మంచి సందేశాన్నిస్తున్నారని కొనియాడరు. ముస్లిం మైనారిటీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్,రాజన్ రాజు,షైక్ నూర్ సాహెబ్, మౌళి సాహెబ్, షేక్ ఇస్మాయిల్ షేక్ అలీ సాహెబ్, అబ్దుల్లా రహీమ్ పాల్గొన్నారు.

గీతం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల వన సంరక్షణ

మొక్కలు నాటుతున్న నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి -మధురవాడ : పిఎంపాలెం గ్రామ పరిధిలోని హెచ్‌పిసగర్‌లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, మెకానికల్ విభాగం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శుక్రవారం వన సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యతను యువత అర్థం చేసుకోవాలన్నారు.ఏ రంగంలో ఉన్నా సమాజం పట్ల బాధ్యతను మరవకూడదన్నారు. వివిధ గ్రామాలను దత్తతకు స్వీకరించి, నిరంతర సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలలో గీతం విద్యార్థులు స్ఫూర్తి నింపుతున్నారని కొనియాడారు. గీతం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 100 మందికి పైగా పాల్గొని హెచ్‌పి నగర్ పరిధిలో మొక్కలను నాటారు. ప్రజలకు ఆరోగ్యకరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో గీతం విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ జి.లక్ష్మీశ్వరి, గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.వి.జి.రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.కనకరాజు, డాక్టర్ ఎమ్.వెంకటరమణ, డాక్టర్ కె.సురేష్ పాల్గొన్నారు.

అంతరిస్తున్న జాతుల సంతానోత్పత్తికి చర్యలు

విశాఖ జూలో 14 కూనలకు జన్మనిచ్చిన రేసు కుక్కలు : దూడకు జన్మనిచ్చిన అడవి దున్న

కూనలకు పాలిస్తున్న తల్లి రేస్ కుక్క



దూడతో అడవి దున్న

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతరించి పోతున్న అరుదైన రేసు కుక్కలు, అడవిదున్నల సంతానోత్పత్తి దిశగా ఇందిరాగాంధీ జంతుప్రదర్శన శాలలో చేపడుతున్న చర్యలు సత్ఫలితా లనిస్తున్నాయి. జూలోనినాలుగు జంటల రేసు కుక్కలు 14 కూనలకు జన్మనిచ్చాయి. వీటితో పాటు అడవిదున్న ఒక దూడకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లుల సంరక్షణలో ఇవి వృద్ధి చెందుతున్నాయని జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. అంతరించి పోతున్న అడవి కుక్కలు, అడవిదున్న సంతతి వృద్ధి, పరిరక్షణ దిశగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో వాటి విజయవంతమైన సంతానోత్పత్తి ప్రధానమైన అడుగుగా భావించవచ్చు న్నారు. జూ అధికారులు సిబ్బంది పర్యవేక్షణలో వాటి రక్షణ, సరైన పోషకాహారం, పెరుగుదలకు సురక్షితమైన వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవి దున్నల జాతి కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అంతరించి పోతున్న రేసు కుక్కలు, అడవి దున్నల కూనలు రాకతో చాలా సంతోషంగా భావిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా జన్మించిన కూనలు త్వరలో సందర్శకుల కోసం ఎన్‌క్లోజర్లలో ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు.

31న చిరంజీవులు ఉద్యోగ విరమణ

- సేవలో మేటిగా గుర్తింపు

సౌరుపల్లి చిరంజీవులు

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ :జివిఎంసిలో పలు హోదాల్లో సేవలందించిన సౌరుపల్లి చిరంజీవులు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన 32 సంవత్సరాలపాటు అంకితభావంతో పనిచేశారు. పలువురి మెప్పుపొందారు. చిరంజీవులు 1966లో లక్ష్మణరావు, కనకరత్నం దంపతులకు శ్రీకాకుళంలోని నరసన్నపేటలో జన్మించారు. అక్కడే పదో తరగతి వరకు విద్యను అభ్యసించారు. ఆ తర్వాత శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను కొనసాగించారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రులయ్యారు. జెఎన్‌టియులో ఎంటెక్ పూర్తి చేశారు. ఆయన 1992 నుంచి 94 వరకు పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌లో సహాయక ఇంజినీర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం ఉద్యోగోన్నతిపై 1994 నుంచి 2000 వరకు జివిఎంసిలో సహాయక ఇంజినీర్‌గా పనిచేశారు. అనంతరం మరో ఉద్యోగోన్నతిపై 2001 నుంచి 2006 వరకు విజయనగరంలోని పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌లో సహాయక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గానూ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గానూ విధులు నిర్వహించారు. బదిలీపై వచ్చిన ఆయన 2007 నుంచి 2014 వరకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేశారు. అనంతరం 2014-17 మధ్య కాలంలో పలాసలోని కాశీబుగ్గ మున్సిపాలిటీకి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేశారు. అనంతరం 2017 నుండి నేటి వరకు జివిఎంసిలోని మెకానికల్, విస్కో, పబ్లిక్ వర్క్స్ కార్యనిర్వాహక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందనున్నారు. వృత్తి పట్ల ఆయన చూపించిన అంకితభావం, నిబద్ధతకుగాను 25 సంవత్సరాలుగా ప్రతి ఏడాదీ స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలలో పలువురు కలెక్టర్లు, కమిషనర్ల నుండి ఉత్తమ ఉద్యోగిగా అవార్డులు అందుకున్నారు. ఆయన తన ఉద్యోగ కాలంలో అప్పుఘర్ వద్ద ఉన్న 25 ఎంఎల్‌డి, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌తో పాటు వాటర్ సప్లై ప్రాజెక్టుల్లో పలు పనులను విజయవంతంగా పూర్తి చేశారు. వీటితోపాటు 32 పెరిఫెరల్ వాటర్ సప్లై స్కీములతో పాటు ప్రధాన అభివృద్ధి పనులలో భాగస్వామ్యం అయ్యారు. ఆయన ఉద్యోగ విరమణ పట్ల ఆయన భార్య సంధ్య, కొడుకు సాయి హర్ష, కోడలు సంధ్యారాణి సంతోషం వ్యక్తం చేశారు సహోద్యోగులు, స్నేహితులు ఘన వీడ్కోలు పలికేందుకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు వేపగుంట, బంటా కాలనీ ఎల్విన్‌నగర్, పురుషోత్తపురం ప్రాంతాల్లో సుమారు రూ.2.20కోట్లతో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం ఏడాది తిరగకముందే అన్ని ప్రాంతాలకు సమానంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసరావు, జనసేన నాయకులు పిల్ల జగన్మోహన్‌పాత్రుడు, చైతన్య, తనకాల శ్రీను, సోమశేఖర్‌నాయుడు, రమేష్ స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

గాజువాకలో...

గాజువాక :జివిఎంసి 75వ వార్డు పరిధిలో సిసి రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో అన్ని కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని, అవసరమైన ప్రాంతాల్లో సామాజిక భవనాలను నిర్మిస్తానని తెలిపారు.కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, వార్డు పార్టీ అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్ పాల్గొన్నారు.

ఇంటింటా కుళాయి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పద్మనాభం. : మండలంలోని పాంఢ్రంగి పంచాయతీ సామయ్యవలసలో రూ.60లక్షలతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద మంచినీటి ట్యాంక్ నిర్మాణం, ఇంటింటా కుళాయి ఏర్పాటు పనులకు స్థానిక టిడిపి సీనియర్ నాయకులు కుచ్చెర్లపాటి రామరాజు ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృషితో తమ గ్రామాలకు మంచినీటి పథకంతో పాటు పలు అభివృద్ధి పనులు జరగడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గంటాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లి మహేష్, నాయకులు మహంతి అప్పలరమణ (శ్రీనివాసరావు), బొబ్బిలి సంతోష్, కర్రోతు రమణ, కోన గణేష్ బాబు, కోన బాలు, పాలూరి స్వామినాయుడు నీలంశెట్టి చిన్నయ్య, బత్తిన పెంటయ్య, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

రూ.53.35లక్షలతో పార్కుల అభివృద్ధి

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డులో రూ.53.35 లక్షల జివిఎంసి నిధులతో పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు స్థానిక వార్డు కార్పొరేటర్ వావిలిప్రసాదు శ్యామల దీపిక తెలిపారు. శుక్రవారం ఆయా పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో పార్కులకు స్థానిక ప్రజలు, సందర్శకులకు సౌకర్యవంతంగా, ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజల సమస్యలు, అవసరాల మేరకు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు కార్యక్రమంలో జీవిఎంసీ ఇంజనీరింగ్ అధికారులు కూటమి నాయకులు వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

కప్పరాడ యుపిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి- సీతమ్మధార :కప్పరాడ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.పి.జగదీశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఎన్‌సిడి 3.0, ఆభ ఐడి జనరేషన్, హెచ్‌బివైసి విజిట్స్‌ను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. యుపిహెచ్‌సిలో అందుతున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. యుపిహెచ్‌సిలో ఓపి, ఐపి, ల్యాబ్ టెస్ట్స్, సాధారణ ప్రసవాల గురించి, ఎన్‌సిడిసిడి.సర్వే, ఆర్‌సిహెచ్ రిజిస్ట్రేషన్స్, కెపిఐ ఇండికేటర్స్‌పై వైద్యాధికారులకు సూచనలు చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఫేషియల్ అటెండెన్స్, క్షేత్ర సందర్శనకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించడంపై సూచనలు చేశారు.

మే 20న దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయడానికి సన్నద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిఐటియు అనకాపల్లి జిల్లా జనరల్ బాడీ సమావేశం శుక్రవారం సిఐటియు కార్యాలయంలో ఆర్ శంకర్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్‌ని ఏప్రిల్‌లో అమల్లోకి తీసుకురానుందని, దీనిపై కార్మిక వర్గం ఆందోళనకు సిద్ధం కావాలన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను కట్టబెడుతూ ప్రజా వ్యతిరేక విధానాల అవలంభిస్తుందని, కార్మికులు, ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలు చేసి మొత్తం బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని విమర్శించారు. ఈ పది సంవత్సరాల కాలంలో దేశ ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ము రూ.16 లక్షల కోట్లు కార్పొరేట్ కంపెనీలకు మాఫీ చేసిందన్నారు. దేశంలోని 140 కోట్ల జనాభాలో 100 కోట్ల మంది కొనుగోలు శక్తి లేకుండా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పి4, 2047 నాటికి స్వర్ణాంధ్ర పేరుతో ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కంపెనీలు వస్తున్నాయని చెబుతూనే ఉన్న కంపెనీలు మూత వేస్తున్నారని తెలిపారు. స్కీమ్ వర్కర్లకు కార్మికులకు ఎటువంటి భరోసా లేకుండా పోయిందన్నారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా లోకనాథం శంకరరావు

కె.లోకనాథం
అధ్యక్షులు

సిఐటియు జిల్లా జనరల్ బాడీ సమావేశంలో సిఐటియు జిల్లా నూతన అధ్యక్షులుగా కె.లోకనాథం, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులుగా జి.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.రాము, జి.దేవుడు నాయుడు, పరమేశ్వరరావు, కార్యదర్శులు జి.వరలక్ష్మి, ఎ.రాజు, బి.చంద్రశేఖర్, వి.సత్యవతి, త్రినాధరావు పాల్గొన్నారు.

ఆర్.శంకరరావు
ప్రధాన కార్యదర్శి

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి

డ్వాక్రా మహిళల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : డ్వాక్రా మహిళల సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. తమ గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు ఐద్వా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడంతో వెంటనే ఐద్వా నేతలు వెలుగు జిల్లా కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. ఈ సమస్యపై 20 రోజులు క్రితమే వినతిపత్రం వెలుగు కార్యాలయ అధికారులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. దీనిపై స్పందించిన వెలుగు అధికారులు ప్రతినెల వాయిదాలు సకాలంలో కట్టలేని ఇద్దరు మహిళలని పిలిపించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు తులసి, బొడ్డే దివ్య, కాండ్రేగుల లక్ష్మి, కాండ్రేగుల కృష్ణవేణి, గ్రూపులో మహిళలు పాల్గొన్నారు.

ఎఎంఎఎల్‌లో ఆంగ్ల భాషపై సెమినార్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఆంగ్లభాషపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. కళాశాల పూర్వపు విద్యార్థి ధూలి రాజు శుక్రవారం విద్యార్థులకు ఆంగ్ల భాష అభివృద్ధిలో పాటించవలసిన మెలకువల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాజు 2015 - 18 బ్యాచ్‌లో బీఎస్సీ చదివి, సెంట్రల్ యూనివర్సిటీలో ఇంగ్లీషులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి, ప్రస్తుతం పీహెచ్‌డి భువనేశ్వర్‌ల ఐఐటీలో చేస్తున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, ఇంగ్లీష్ హెచ్‌ఓడి బిఎస్.సాగర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కశింకోట : కసింకోటలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే రహమాన్ (బాబర్) ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తారు విందులో ఎమ్మెల్యే కొణతల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతబ్బాయి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్కే బాబర్, ఎంఎంఆలీ, రబ్బాని,ఎండి రజాక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మార్చి 29న శనివారం టిడిపి అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరగనుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు తెలిపారు.

సబ్బవరం : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఈనెల 29న శనివారం టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సం నిర్వహిస్తున్నట్లు టిడిపి నేతలు శుక్రవారం ప్రకటనలో పేర్కొంది.

రీ సర్వేపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ రెవిన్యూ గ్రామంలో భూములు రీ-సర్వేపై అధికారులు శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ సురేష్, మండల సర్వేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో భూములనింటినీ సర్వే చేసి రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల్లో రీ-సర్వేపై ఉన్న అపోహలను తొలగించడానికి అవగాహన సదస్సును, ర్యాలీని నిర్వహించినట్లు చెప్పారు. రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, విఆర్‌ఓ సాయి, సర్వేయర్ అజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పోలీసు సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న వివిధ స్థాయిల సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను స్వయంగా పరిష్కరించేందుకు శుక్రవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో "పోలీస్ గ్రీవెన్స్" కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు సిబ్బంది, హెూం గార్డులు ఆరోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీకి వివరించారు. వీటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించి, ఆయా విజ్ఞప్తులను పరిశీలించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఉద్యోగాల్లో కలిగే ఒత్తిడిని తగ్గించేందుకు, వారి సంక్షేమాన్ని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందని ఎస్పి తెలిపారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-యలమంచిలి : పాడి పరిశ్రమ అభివృద్ధికి సంఘమిత్ర కో ఆపరేటివ్ సమాఖ్య రైతులకు అన్ని విధాల తోడ్పతుందని సమాఖ్య అధ్యక్షురాలు శిలపరశెట్టి చిట్టెమ్మ అన్నారు. యలమంచిలి పశుసంవర్ధక శాఖ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం జరిగిన పాడి రైతుల సదస్సులో ఆమె పాల్గొని సమాఖ్య ఆశయాలు వివరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్‌ఎంఎం.గంగాధర్ మాట్లాడుతూ ఫాడర్ ఎఫ్‌పిఓ వలన రైతులకు కలిగే లాభాలను వివరించారు. సంఘాలు ఏర్పాటు చేసుకొని సమాఖ్యలో చేరి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఏటికొప్పాక పశువైద్యులు డాక్టక్ దేవరాజు రైతుల సందేహాలకు సమాధానిచ్చారు. కార్యక్రమంలో ఏటికొప్పాక, కృష్ణాపురం, బయ్యవరం, పురుషోత్తపురం, రేగుపాలెం, సోమలింగపాలెం పాడి రైతులు, సమాఖ్య ఉపాధ్యక్షుడు ఆళ్ల అప్పలనాయుడు, డైరెక్టర్ నాగేశ్వరరావు, పారా వెటర్నరీ సిబ్బంది, ఆర్‌ఎస్‌కె, ఎహెచ్‌ఎ తదితరలు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-యలమంచిలి : బిసి కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 114 మంది దరఖాస్తు చేయగా, ఇంటర్వ్యూలకు 55 మంది హాజరయ్యారు. సగం సబ్సిడీ రుణాలు కోసం అభ్యర్థులనుండి ఆశించిన మేర ఆసక్తి రాకపోవడం అధికార్లను ఆలోచనలో పడేసింది. తుదిగా లబ్దిరారుల ఎంపికలో రాజకీయాలు చోటుచేసుకుంటాయా అన్న అనుమానం హాజరైన లబ్దిదారుల్లో మొదలైంది. ఎంపికైన అభ్యర్థుల వివరాలు త్వరలోనే తెలియజేస్తామని బ్యాంకర్లు తెలిపారు.

ఎక్సైజ్ సిఐ పాపునాయుడుకు నగదు రివార్డు

ప్రజాశక్తి-చోడవరం : నవోదయం 2.0లో భాగంగా నాటుసారాను అరికట్టడంలో మంచి ప్రతిభ కనబరిచిన చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్ దేవ్‌శర్మ చేతుల మీదుగా ఇటీవల పాయకరావుపేటలో జరిగిన సమావేశంలో నగదు రివార్డును అందుకున్నారు. నిత్యం ఫీల్డ్ తనిఖీలు చేస్తూ కాపు సారా, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేయడంలోనూ, అరికట్టడంలోనూ మంచి కృషి చేసినందుకు ఈ రివార్డును ఆయనకు అందించారు. సందర్భంగా సిఐ పాపనాయుడును పలువురు సిబ్బంది అభినందించారు.

ఎక్సైజ్ సిఐ పాపు నాయుడుకు రివార్డు అందిస్తున్న రాహుల్ దేవ్ శర్మ

బెల్లం మార్కెట్ అభివృద్ధికి చర్యలు

జిల్లా కలెక్టరు విజయకృష్ణన్

బెల్లం మార్కెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్‌టిఆర్ బెల్లం మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అన్నారు. స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణతో కలిసి శుక్రవారం బెల్లం మార్కెట్‌ను జిల్లా కలెక్టరు సందర్శించారు. మార్కెట్ యార్డులో ప్రస్తుతం అందుబాటులో గల షెడ్లు, గోదాములు వివరాలు, ప్రస్తుతం వినియోగిస్తున్న వాటి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కొణతాల మార్కెట్ యార్డులోని సమస్యలు, అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు గూర్చి జిల్లా కలెక్టరుకు వివరించారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మార్కెట్ యార్డులో రైతు బజార్ ఏర్పాటు ద్వారా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేసి మార్కెట్ యార్డ్‌కి పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా మార్కెటింగ్ అధికారి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు ప్రారంభం

నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ కథా రచయిత ఆకెళ్ళ సూర్యనారాయణ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికోత్సవాలను శుక్రవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. స్థానిక వివి రమణ రైతు భారతి ఆడిటోరియంలో 1975 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థుల ప్రోత్సాహంతో, అనకాపల్లి డైమండ్ హిట్స్ సంస్థ సహకారంతో ఆకెళ్ళ నాటికల సంబరాలు ఈనెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ నాటికల ప్రదర్శనలో భాగంగా శుక్రవారం కాకినాడ మూర్తి కల్చరల్ అసోసియేషన్ వారిచే పెద్దలకు మాత్రమే నాటిక, 7.30 గంటలకు జయశంకర్ దర్శకత్వంలో సహప్రయాణం నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఆకెళ్ళ వారి నాటికలు సమాజాన్ని ఆలోచింపజేసేలా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ కేఎం నాయుడు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారుల ఇకెవైసి గడువు 3 రోజులే

ప్రజాశక్తి-యలమంచిలి : రేషన్ లబ్ధిదారుల ఈకెవైసీ నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఈ నెల 31లోగా ప్రతి కుటుంబ సభ్యుల నుంచి ఈకెవైసీ సేకరించాలని రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది. తహశీల్దార్లు, డీలర్లు, విఆర్వోలు యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించారు. సరుకుల పంపిణీలో పారదర్శకత కోసం జాతీయ సమాచార సంస్థ (ఎన్‌ఐసి) ఆధ్వర్యంలో రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను నవీకరించారు. ఈకెవైసీ చేయించుకోని వారి వివరాలు ఇప్పటికే డీలర్లుకు, వీఆర్వోలకు అందించారు. నిత్యావసరాలు పొందే ప్రతి లబ్ధిదారూ ఆయ చౌకధరల దుకాణం వద్దకు వెళ్లి బియ్యంకార్డు, ఆధార్ చూపించి డీలర్ దగ్గర గల ఈపోస్ మిషన్‌ద్వారా వేలిముద్రలు వేయాలి. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉంటే గతంలో ముగ్గురికి చేసినా, తిరిగి నలుగురూ చేయాలని చూపిస్తుండడంతో కాస్త గందళగోళం ఏర్పడిందని డీలర్లు వాపోతున్నారు .దీనిపై తహశీల్దార్ వరహాలును వివరణ కోరగా డీలర్ల దగ్గరున్న ఈపోస్ యంత్రాల్లోనే ఈకెవైసీ చేయించుకోవాలని తెలిపారు. వీఆర్వోల వద్ద ఉన్న జీఎస్‌డబ్ల్యూఎస్ యాప్ ద్వారా అయినా చేసుకోవచ్చని చెప్పారు చిన్నారుల వేలిముద్రలు పడకపోతే ఉన్నతాధికర్లకు నివేదించాలని సూచించారు.

రోడ్డు విస్తరణ బాధితులకు టిడిఆర్ బాండ్లు ఇస్తామని ఎమ్మెల్యే చెప్పడం సరికాదు

నిర్వాసితుల సంఘం కన్వీనర్ బ్రహ్మాజీ

ప్రజాశక్తి -మునగపాక : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ బాధితులకు వియంఆర్‌డిఏ ద్వారా టిడిఆర్ బాండ్లు ఇస్తామని శాసనసభ్యులు సుందరపు విజయ్‌కుమార్ గురువారం జరిగిన నిర్వాసితుల సమావేశంలో చెప్పడం సరికాదని రోడ్డు నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ అన్నారు. స్థానిక పిఏసిఎస్ ఆవరణలో శుక్రవారం జరిగిన నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని ఎమ్మెల్యే చెబుతున్నారని, అయితే అభివృద్ధి కార్యక్రమాలకు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేస్తున్న ప్రభుత్వం రోడ్డు విస్తరణ బాధితులకు సుమారు రూ.150 కోట్లు చెల్లించ లేదా? ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లలేరా? అని ప్రశ్నించారు. టిడిఆర్ బాండ్లు తీసుకున్న వేలాదిమంది రోడ్డున పడిన విషయం మీకు తెలియదా? వారిలా తాము కూడా కుటుంబాలతో రోడ్డును పడి నష్టపోయే విధంగా ఎమ్మెల్యే వ్యవహరించడం తగదన్నారు. వియంఆర్‌డిఏ పరిధి అంటే టిడిఆర్ బాండ్లు ఇస్తారన్న విషయం భూసేకరణ జరిపేటప్పుడు తమరు మరిచారా? అని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వాన్ని ఏపీఐఐసీ వంటి సంస్థలను ఒప్పించి నగదు రూపేనా చెల్లింపులు చేసి ప్రజాప్రతినిధిగా నిర్వాసితుల న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాసితులు ఆడారి శ్రీనివాస నాయుడు, టెక్కలి గంగునాయుడు, కాంగ్రెస్‌గుల ధర్మ, విల్లూరు జగన్నాథరావు, ఆడారి సూరిబాబు, రమణాజీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్వాసితుల సంఘం కన్వీనర్ బ్రహ్మాజీ

వైభవంగా అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో శుక్రవారం మరిడిమాంబ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయ మూడో వార్షికోత్సవం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండి అమ్మవార్లకు పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. చౌడువాడ పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. కోలాటాలు, ఎడ్ల పరుగు ప్రదర్శనలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. మహిళా కోలాటం భక్తులను ఆకట్టుకుంది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

దళితులను గాయపరిచిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం ఉడేరు పంచాయతీ అల్లికనుడుపాలెంలో దళితులను గాయపరిచిన వ్యక్తులపై తక్షణమే ఎస్సీ ఎస్టీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అల్లికనుడుపాలెం గ్రామాన్ని జిల్లా జై భీం సేన ఆర్మీఐ జిల్లా కమిటీ శుక్రవారం సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ ఈనెల 20న అల్లికనుడిపాలెంలో ప్రోగ్రామ్స్ తిలకిస్తూ డాన్స్ చేసిన గునూరు అప్పారావు, గునూరు నాగరాజులను పెద్దందారులు కొట్టడమే కాకుండా గునూరు లక్ష్మీ, భర్త కోటిపై కుల వివక్షత చూపుతూ ఆమెపై విచక్షణంగా దాడి చేయడం అమానుషమన్నారు. కుల వ్యవక్షతకు పాల్పడిన సిరిగిరిశెట్టి గోవింద్, సిరిగిరిశెట్టి నగేష్, సిరిగిరిశెట్టి శివ గణేష్, సిరిగిరిశెట్టి సాయి, సిరిగిరిశెట్టి రమణ, సిరిగిరిశెట్టి శ్రీనాథ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్లవరపు లోవ చందు, కొండలరావు, మహేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

'స్టార్టప్' ప్రారంభంపై సెమినార్

ప్రజాశక్తి- అనకాపల్లి : డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం "స్టార్టప్ ఎలా ప్రారంభించాలి" అనే అంశంపై ఐసీటీ అకాడమీ సహకారంతో పవర్ సెమినార్ నిర్వహించారు. 'హ్యాపీ పే' సంస్థ సీఈవో, ఫౌండర్ దేవీకిరణ్ కాసిరెడ్డి మాట్లాడుతూ హ్యాపీ మార్నింగ్ అనే కాన్సెప్ట్ ను విద్యార్థులకు పరిచయం చేశారు. ప్రతి రోజు ఉత్సాహంగా ప్రారంభించి, ఆశా భావంతో ముందుకు సాగితే జీవితంలో విజయాన్ని సాధించగలమని వివరించారు. మంచి ఆలోచనలు, నిత్యం ఉత్తమ ప్రయత్నాలు మనల్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని చెప్పారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ స్టార్టప్‌లు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎంత ముఖ్యమైనవో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, అన్ని విభాగాల హెచ్.ఓ.డీలు, అకడమిక్ కోఆర్డినేటర్ ఏ.కృష్ణ నాగ్, డీన్ అడ్మిన్ కే.ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పల్గొన్నారు.

ఎస్పికి నూకాంబిక జాతర ఆహ్వానం

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకంబిక అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంపలి రాంబాబు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాని శుక్రవారం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కొత్త అమావాస్య అమ్మవారి జాతర ఆహ్వానాన్ని ఎస్పీకి అందించారు. ఆలయ పరిపాలన, భక్తుల ఏర్పాట్లు, భద్రతా చర్యలపై వివరణ ఇచ్చారు. జిల్లా పోలీసులు, భక్తుల రద్దీకి అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడతారని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు.

డైలీ మార్కెట్, వారపు సంత ఆశీలు వేలం పాట

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీలోని డైలీ మార్కెట్, వారపు సంతల ఆశీలు వసూలు నిమిత్తం వేలంపాట శుక్రవారం నిర్వహించారు. ఇన్చార్జి ఈఓపిఆర్‌డి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఈ వేలం పాట నిర్వహించారు. డైలీ మార్కెట్ ఆశీలు వసూలు వేలంపాటను రూ.5,23,000కు సింగంపల్లి రమేష్ ఖరారు చేసుకున్నట్లు పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. గతేడాది కంటే లక్ష 85 వేల రూపాయలు ఆదాయం పెరిగిందన్నారు. వారపు సంత వేలంపాట 3లక్షల ఆరు వేల రూపాయలకు దొడ్డి ముత్యాల నాయుడు ఖరారు చేసుకున్నట్లు తెలిపారు. గత ఏడాది కంటే రూ.96వేలు ఆదాయం పెరిగిందన్నారు. ఈ వేలంపాటలో 36 మంది పాటదారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డెడ్డం ప్రసాదరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అప్పలరాజు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఖరీఫ్ సీజన్లో రెండున్నర లక్షల ఎకరాల్లో ధాన్యం పండించగా, ప్రభుత్వం రైతుల నుండి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయలేదని తెలిపారు. దీంతో ప్రైవేటు మిల్లర్లు దోపిడీకి రైతులు గురై తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 76 కేజీల ధాన్యం బస్తాకి రూ.1450 మాత్రమే ఇస్తాము, ఇష్టమైతే అమ్మండి లేకపోతే లేదని రైతులను బెదిరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో గత్యంతరం లేక రైతులు ప్రైవేటు మిల్లర్ల బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారు. అనకాపల్లి జిల్లాలో రాంబిల్లి, నక్కపల్లి, కశింకోట మండలాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం బస్తాలు వేసి ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా? అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు, ఎస్‌వి.నాయుడు, భూలోక నాయుడు, బి.రంగారావు, తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తత నడుమ నూకాంబిక జాతర

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడిలో కొత్త అమావాస్య నూకాంబిక జాతర సందర్భంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేసే విషయంలో కొద్ది రోజులు వైసిపి, టిడిపి వర్గీయులు మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి రెండు వర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకొని ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో ఎస్ఐ శ్రీనివాసరావు గ్రామంలో 144 సెక్షన్ విధించారు. రెండు వర్గాల మధ్య రాజీ కుదుర్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రెండు వర్గాలు వేర్వేరు చోట్ల భక్తులకు అన్నదానం చేశారు. పెదపూడిలో శుక్రవారం నూకాంబిక అమ్మవారి జాతర పోలీసు బందోబస్తు మధ్య కొనసాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇరు గ్రూపులను సముదాయిస్తున్న పోలీసులు

బుదిరెడ్లపాలెంలో క్షీణించిన పారిశుధ్యం

శ్రమదానంతో డ్రైయినేజీల్లో పూడిక తొలగించిన మహిళలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి శివారు బుదిరెడ్లపాలెంలో డ్రెయినేజీలు పూడిక పోయినా నెలల తరబడి పంచాయతీ అధికారులు తొలగించలేదు. దీంతో మురుగునీరు ప్రవహించక ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీంతో స్థానిక మహిళలే శుక్రవారం నడుం బిగించారు. మహిళలు అంతా కలిసి పారా తట్టా పట్టుకుని కాలువలో ఉన్న చెత్త చెదారం అంతా బయటికి తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమస్య ఇప్పటినుంచి కాదని, కొన్ని నెలలుగా ఇలాగే ఉందని, అధికారులున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొద్ది నెల నుండి వీధిలైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదని, వాటర్ ట్యాంక్ క్లీన్ చేయడం లేదని, పంచాయతీ కుళాయిలు సమయానికి రావడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బుదిరెడ్ల పాలెం గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని, వాటర్ ట్యాంక్ శుభ్రం చేసి సమయానికి పంచాయతీ కుళాయిలు వచ్చేలా, వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రెయినేజీలో పూడిక తీస్తున్న మహిళలు

ఉత్సాహంగా జిల్లా స్థాయి కోలాటం పోటీలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారంలో కొత్త అమావాస్య నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా గురువారం రాత్రి జిల్లాస్థాయి కోలాటం ప్రదర్శన పోటీలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము వరకు కోలాటం ప్రదర్శనలు ఉత్సాహంగా కొనసాగాయి. జిల్లా నలుమూల నుండి 25 కోలాటం బృందాలు ఈ పోటీలలో పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన అడ్డూరు కోలాటం బృందానికి కమిటీ సభ్యులు రూ.12వేలు నగదు పురస్కారం అందించారు. తరువాత స్థానాల్లో నిలిచిన మరో ఏడు బృందాలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి బృందానికి రవాణా ఖర్చుల కింద రూ.1500 అందించారు. న్యాయ నిర్ణేతగా కూచిపూడి అవార్డు గ్రహీత భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మ, దుర్గాప్రసాద్ భవానీ వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీ దేవర అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దిబ్బిడి ప్రాథమిక పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ-2 బుద్ద కాశీవిశ్వేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. 1, 2 తరగతుల విద్యార్థులలో తెలుగు, ఇంగ్లీష్, గణితంలో సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులచే స్వయంగా న్యూస్ పేపర్ చదివించారు. విద్యార్థులు అవలీలగా న్యూస్ పేపర్, పుస్తకాలు చదవడంతో ఎంఈఓ అభినందించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు.

అంబేద్కర్ సేవారత్న అవార్డుకు కాటపల్లి ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : దేవరాపల్లికి చెందిన దళిత నాయకుడు కాటపల్లి అప్పారావు రాష్ట్రస్థాయి అంబేద్కర్ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. 30 ఏళ్లుగా సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి, రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తూ, ఉద్యమ నేతగా, జర్నలిస్టుగా, ప్రజా గాయకుడిగా అప్పారావు విశేష సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అప్పారావుకు అంబేద్కర్ సేవారత్న అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును ఈ నెల 30న ఒంగోలులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారాల మహోత్సవంలో ప్రదానం చేయనున్నారు. కాటపల్లికి అవార్డు రావడం పట్ల అంబేద్కర్ సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, పాత్రికేయులు, అభినందనలు తెలిపారు.

ఉగాది సంబరాల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : ఉగాది సందర్భంగా ఆదివారం స్థానిక ప్రేమ సమాజంలో ప్రసన్న భారతి, సంస్కార భారత్ సంయుక్తంగా కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. అఖిల తెలుగు అమ్మాయి వయ్యారాల నడక కేటగిరి -1కు 1, 2, 3 తరగతులు, కేటగిరి-2కు 4, 5, 6 తరగతులు, కేటగిరి-3కి 7 8 9 తరగతుల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. అశ్లీలతకు చోటు లేకుండా పూర్తిగా తెలుగుదనం ఉట్టిపడేలా తయారై వయ్యారంగా స్టేజ్ మీద నడిచి రావలసి ఉంటుందని తెలిపారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించే తెలుగులోనే మాట్లాడుకుందాం రా కార్యక్రమంలో పూర్తిగా తెలుగులోనే మాట్లాడవలసి ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి పవన విజయం నాటకంతో పాటు వివిధ రకాల అన్నమాచార్య కీర్తనలు, పాటలతో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌జె శర్మ, ప్రాత రాజశేఖర్, దేవుడు మాస్టారు, ప్రకాష్ రావు, కొండలరావు, విశ్వనాథ్, ప్రేమ సమాజం రాజు, డిఎస్ ప్రసాద్, పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాలు అందించాలి

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రైతులకు సకాలంలో అవసరమైన విత్తనాలు అందించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో అగ్రికల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉగాది తరువాత ఏరువాక ముహూర్తం ప్రారంభమయ్యే సమయానికి రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. నర్సీపట్నం ప్రాంతంలో ఆర్‌జెఎల్, సాంబ మసూరి వరి విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని అగ్రికల్చర్ అధికారులను ఆదేశించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడినిచ్చే కొత్త రకాల విత్తనాలు ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో రైతులకు అవసరమైన ఆధునిక వ్యవసాయ యంత్రాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సమగ్ర శిక్ష అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలకు నూతన భవనాలకు సుమారు కోటి 20 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మాకవరపాలెం, వేములపూడి, నాతవరం ప్రాంతాలలో ఏప్రిల్ మొదటి వారంలో భవనాలకు శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారులు ఏడీవో శ్రీదేవి, ఎంఏఓ అప్పారావు, సమగ్ర శిక్ష అధికారులు డీఈ సుబ్బలక్ష్మి, ఈ.నరసింహారావు, ఏఈ రమణాజీ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్

షాపుల వేలం పాటలో గందరగోళం

-నిర్వహణపై పాటదారులు, పాలకవర్గం మధ్య వాగ్వాదం - నేటికి వాయిదా వేసిన కార్యదర్శి

ప్రజాశక్తి- మాడుగుల:పంచాయతీ షాపుల వేలంపాట నిర్వహణల్లో గందరగోళం నెలకొంది. దీనికి సంబంధించి వివరాలు... మాడుగుల మేజర్ పంచాయతీలో కాంప్లెక్స్-1లో 17 షాపులు, కాంప్లెక్స్-2లో 13 పంచాయతీ షాపులు మొత్తం 30 షాపులు ఉన్నాయి. ఈ షాపులకు సంబంధించి శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఒకటవ సచివాలయంలో బహిరంగ వేలం పాటకు సంబందించి వెయ్యి రూపాయలు చొప్పున డిపాజిట్ చేయించుకొని బహిరంగ వేలం పాటని నిర్వహించారు.

బహిరంగ వేలంపాటకు ప్రారంభానికి ముందు పంచాయతీ పాలకవర్గం కలుగజేసుకొని ఇప్పటివరకు పంచాయతీ షాపులను నడుపుతున్న వారికే పంచాయతీ షరతుల ప్రకారం ఇప్పటి వరకు ఇస్తున్న అద్దెపై 5శాతం పెంచి కట్టబెట్టాలని భావించారు. దీంతో డిపాజిట్ దారులు వ్యతిరేకించి డిపాజిట్లు కట్టించుకున్న తరువాత బహిరంగ వేలంపాట నిర్వహించకపోతే ఊరుకొనేది లేదని నిలదీశారు. బహిరంగ వేలంపాటతో పంచాయతీకి వస్తున్న ఆదాయాన్ని పాలకవర్గ అడ్డుపెట్టడం ఏమిటని ప్రశ్నించి పాట నిర్వహించాల్సి దేనంటూ పట్టుబట్టారు. ఇదే తరుణంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకారం కేటాయించిన షాపులను తామే మే పాడుకుంటామని పట్టుబట్టారు. దీంతో పాలకవర్గం, పాటదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టి బయటకు పంపించారు.

అనంతరం సర్పంచ్ యడ్ల కళావతి మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఉన్న వ్యాపారులకే తిరిగి షాపులు ఇచ్చేందుకు తీర్మాణం చేస్తామని తమకు తెలియకుండా పాట నిర్వహిస్తే ఒప్పుకునేది లేదని పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబుకి తేల్చిచెప్పారు. పంచాయతీకి ఆదాయం సమకూరేలా ప్రజలు, వ్యాపారులు బహిరంగ వేలం పాటను కోరుకుంటుంటే పాలకవర్గం ఎందుకు అంగీకరించలేదో చెప్పాలంటూ పలువురు పట్టుబట్టారు. దీంతో పాలకవర్గం, పాటదారుల మధ్య తోపులాట జరిగింది. చేసేది లేక పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు పాటదారులతో మాట్లాడుతూ, ఈనెల 29వ తేదీకి పాటను వాయిదా వేస్తున్నామని తెలిపారు.

అధికారులను నిలదీస్తున్న పాటదారులు

ఇంటర్వ్యూ చేస్తున్న బ్యాంక్ అధికారులు

కార్పొరేషన్ రుణ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- మాడుగుల:రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా వెనుక బడిన కులాలకు ఉపాధి కల్పించేందుకు తలపెట్టిన సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ మేరకు శుక్రవారం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో ఎండిఓ కే.అప్పారావు ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో 54 యూనిట్లకు 480 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి మాడుగుల, కేజీపురం, వడ్డాది బ్యాంకుల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాలపరెడ్డి వెంకట రాజారాం, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఒ

చెత్త రహితంగా గ్రామాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. నక్కపల్లిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద శుక్రవారం ఎస్.రాయవరం మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లకు గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. తడి పొడి చెత్త సేకరణ పై ముందుగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డంపింగ్ యార్డ్ నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ విధానం గురించి వివరించారు. ఇన్చార్జి ఇఓపిఆర్డి శ్రీను, ఎంసిఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - చీడికాడ:మండలంలోని గ్రామాలలో భూ సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల పరిషత్ అధ్యక్షులు కే.జయమ్మ, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబులు కోరారు. నూతన తహసిల్దార్ కిషోర్ లింకన్‌ను నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, పార్టీ నాయకులు స్వామి నాయుడు, లాలం శివకుమార్, చైతన్య, పరవాడ మహేష్, గంజి బాలాజీ, లాలం వెంకీ నాయుడు, ఆర్మీ నాయుడు, సలాది గంగశేషు, కొరచా నారాయణమూర్తి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం పోస్టర్‌ను శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి ఆధ్వర్యంలో విడుదల చేశార. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు నిర్వహించే అమ్మవారి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ రోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మరిసా వెంకటరమణ, మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, అనకాపల్లి టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు గోలకొండ శ్రీకాంత్, ఉత్సవ కమిటీ చైర్మన్ లంక సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్ పాల్గొన్నారు.

దిబ్బిడిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

'ఉపాధి హామీ' గ్రామసభలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: గత ఏడాది కాలంగా మండలంలో 35 గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై గత రెండు రోజులుగా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా చినఅప్పన్నపాలెం, దిబ్బిడి, వడ్డాది తదితర గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి కూలీల వేతనాలు, చెల్లింపులు, వ్యత్యాసాలు, హార్టికల్చర్, మెటీరియల్ పనులకు సంబంధించిన పలు పనులపై ఉపాధి కూలీల నుండి సామాజిక తనిఖీ బృందాలు వివరాలు సేకరించాయి. మండలంలో 35 గ్రామాలకు సంబంధించిన ప్రజా వేదిక నిర్వహణకు బుచ్చయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29న జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

గ్రామాల్లో పండగల సందడి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా జరిగిన తీర్థం శుక్రవారంతో ముగిసింది. స్వామివారి కల్యాణోత్సవాలు ఈనెల 9న ప్రారంభమై 17వ తేది రాత్రితో ముగిసాయి. ప్రతీ ఏటా స్వామి వారి ఉత్సవాలు సందర్భంగా కొత్త అమావాస్య ముందు రోజు వరకు తీర్థ జరుగుతుంది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా మార్చి 10వ తేదీ నుండి 28 తేదీ వరకు తీర్థం జరిగింది. తీర్థంలో మసాలా దినుసులు, పిల్లల ఆట వస్తువులు, గృహోపకర సామాగ్రి, గాజులు, ఫ్యాన్సీ షావులతో పాటు తినుబండరాలకు సంబందించి తోపుడు బండ్లపై ఖర్జూరం, శెనగపప్పు, ద్రాక్ష వంటివి విక్రయించారు. పలు ప్రాంతాల నుండి వ్యాపారులు తాత్కాలికంగా షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించారు. 19 రోజుల పాటు ఉపమాకలో తీర్థం జరగడంతో పలు ప్రాంతాల నుండి భక్తులు వారి కుటుంబ సభ్యులతో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థంలో తమకు కావలసిన సామాగ్రిని కొనుగోలు చేసుకుని తీసుకువెళ్లారు. శుక్రవారంతో తీర్థం ముగియడంతో వ్యాపారులు తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్ళిపోయారు.

నక్కపల్లి:మండలంలో వేంపాడు గ్రామంలో శుక్రవారం నూకాలమ్మతల్లి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయంలో పువ్వులు పలు రకాల పండ్లు అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది. కొత్త అమావాస్య సంధర్భంగా ఒకరోజు ముందుగా నూకాలమ్మ జాతరను గ్రామంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు.

ఆలయం వద్ద భక్తులు

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి సూచించారు. శుక్రవారం గొలుగొండ మండలం గుండుపాల చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి ఇచ్చేలా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌ఒ మూర్తి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న జనసేన నేత రాజు

అక్రమ మైనింగ్ క్వారీల యజమానులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలంలో అక్రమ మైనింగ్ క్వారీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్‌ఎన్.రాజు కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పివిఎస్‌ఎన్.రాజు మాట్లాడుతూ, 14 క్వారీలలో ఏ ఒక్కటికీ కూడా అనుమతి ఉత్తర్వులు లేవన్నారు. వేబిల్లులు జారీ, సెస్ వంటి వాటిపై అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

అవార్డును ఇస్తున్న వైద్య సిబ్బంది

టీబీ నిర్మూలన గ్రామంగా మాడుగుల

ప్రజాశక్తి- మాడుగుల:టీబీ నిర్మూలన గ్రామంగా మాడుగులను జిల్లా కుష్టు వ్యాధి ఎయిడ్స్ కంట్రోల్ అధికారులు గుర్తించారని టీబి హెల్త్ సూపర్వైజర్ ఈశ్వరరావు తెలిపారు. ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఎం ఎల్ హెచ్ పి లు గత కొద్ది రోజులుగా ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు టీబీ వ్యాధి నివారణ పై అవగాహన అవగాహన కల్పించడంతో ఈ వ్యాధి నిర్మూలన అయ్యిందని అన్నారు.ఈ మేరకు టీబి విముక్త పంచాయితీ అవార్డును జిల్లా అధికారులు అందించారన్నారు. శుక్రవారం ఈ అవార్డును పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మూర్తిబాబుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.

4న కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి- పాడేరు, : విశాఖపట్నం లోని హెచ్ సి జి కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ నాల్గవ తేదీ శుక్రవారం పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయం దగ్గర ఉచితంగా నిర్వహించనున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు కేన్సర్ అనుమానిత ప్రజలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ హెచ్ సి జి కేన్సర్ సెంటర్ రూపొందించిన గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసనలు

విశాఖలో బిల్లుల దహనం, అనకాపల్లిలో రాస్తారోకో

ఆరిలోవలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

పెందుర్తిలో...

ప్రజాశక్తి-అనకాపల్లి

సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా, రూ.15,485 కోట్లు అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. అలాగే ప్రతినెల యూనిట్‌కు అదనంగా 40 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తుందన్నారు. ఏపీ ట్రాన్స్‌కో కోవిడ్ సమయంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, కొత్త ప్రాజెక్టులను చేపట్టలేదని, దీనివలన అంచనాల్లో చూపిన అభివృద్ధి వ్యయం మిగులు ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ఇచ్చిన హామీ పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సర్దుబాటు చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని, ట్రాన్స్‌కో ద్వారా వచ్చిన మిగులు రూ.1000 కోట్లు ట్రూ డౌన్ చేసి విద్యుత్ టారిఫ్‌లు తగ్గించాలని డిమాండ్ చేశారు. సెకీతో ఒప్పందాల వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందని విద్యుత్ శ్వేతపత్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో వెల్లడించిన విషయాన్ని గుర్తు చేశారు. వెంటనే సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురం : విద్యుత్ విధానాల అమలులో వైసిపి, కూటమి ప్రభుత్వాలు దొందూదొందేనని సిపిఎం జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు మండిపడ్డారు.శుక్రవారం ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్లు బిగింపును వ్యతిరేకిస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మల్కాపురం విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. విద్యుత్‌బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు విద్యుత్‌ఛార్జీలను పెంచబోమని హామీనిచ్చిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన తర్వాత గత జగన్ ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తున్నారని, రెండింటికీ మధ్య తేడా లేదన్నారు. .కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఎ.సత్యారావు, పి. రామారావు, పివి భాస్కరరావు, ఎన్.శ్రీనివాసరావు, డివైఎఫ్‌ఐ అధ్యక్ష కార్యదర్శులు బి.శ్రీను, యస్.వాసు, సిఐటియు నాయకులు ఎం.కృష్ణారావు ఆర్ నాగేశ్వరరావు, ఏసు బాబు, బాల, డి.రాజు, నీలయ్య, గణేషు, బి.ప్రసాదు, అర్జునరావు, కిరణ్, ప్రేమ్ సమీర్ పాల్గొన్నారు,

మాధవధార : కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పైడిమాంబ గుడి దరి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎఇఇకి వినతిపత్రం అందజేశారు.పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి.పద్మ, వి. కృష్ణారావు, జోన్ కార్యదర్శి బొట్టా. ఈశ్వరమ్మ, జోన్ నాయకులు ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరావు, ఎస్.శ్రావణ్, జి

కంచరపాలెంలో...

శ్రీనివాస్, కె. రాంబాబు, వై.సత్యవతి, పి.సత్య, పి.శారద, ప్రసాద్ పాల్గొన్నారు.

గాజువాక.: విద్యుత్‌భారాలపై గాజువాక ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ గాజువాక జోన్‌కార్యదర్శి ఎం రాంబాబు , జోన్ కమిటీ నాయకులు ఎ.లోకేష్, ఎల్ బంగారునాయుడు, కె సంతోషం, జి లక్ష్మి, కె.కిరీటం కొలగన అప్పారావు, త్రినాధ్ స్వామి, నాగరాజు, సింహాద్రి, రాజు, జె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఎం స్టీల్ డివిజన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సబ్‌స్టేషన్ విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన చేపట్టారు.. పార్టీ స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, బి గురప్ప, డి వెంకటరావు, కణితి అప్పలరాజు, సిహెచ్ రాముడు, పాల అప్పల రెడ్డి, ఆనంద్, వీర రెడ్డి పాల్గొన్నారు..

తగరపువలస: విద్యుత్ భారాలపై సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. పార్టీ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, పార్టీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు, నీలాతి రాము, పల్లా పెంటరాజు, నమ్మి

భీమిలిలో...

నాయుడు, సూర్య నారాయణ, వెంకటరావు పాల్గొన్నారు.

మధురవాడ : విద్యుత్ భారాలపై ఎపిఇపిడిసిఎల్ మూడో జోన్ కార్యాలయం వద్ద సిపిఎం మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. పార్టీ జోన్ కమిటీ నాయకులు డి.అప్పలరాజు, కార్యకర్తలు బి.భారతి, డి కొండమ్మ, జి.కిరణ్, ఎ.గురుమూర్తిరెడ్డి, ఎల్ పద్మ, కె. చిట్టిబాబు, కె.సుజాత, కె పుష్ప పాల్గొన్నారు..

సీతమ్మధార : సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌కె.నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు సబ్‌స్టేషన్ ఉన్నతాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రాజు, జోన్ నాయకులు అప్పలరాజు, స్వతంత్రకుమార్, లక్ష్మీపతి, లీల పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి ఎపిఇపిడిసిఎల్ డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎడిఇకి వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి , జోన్ కమిటీ సభ్యులు శంకరరావు నాయకులు కె.అప్పలనాయుడు ,ఎన్ రాజు, ఈశ్వరరావు, ఎం రాజు, అన్నపూర్ణ ముత్యాలమ్మ పాల్గొన్నారు.

ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రి ఆవరణలోని విశాలాక్షినగర్ ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎఇఇకి వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.కెస్‌వి కుమార్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందించాలని, లోడ్ పేరుతో అదనపు భారాలు వేయవద్దని, సెకీ ఒప్పందం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు పి.మణి, పి.శంకరరావు, డి.నాగరాజు, వి.కాంతం, ఎస్.గౌరీ, జి.నాగరాజు, చంద్రమౌళి, సాయి, రాజేష్, నారాయణ మూర్తి, శాంతి, దేవుడమ్మ, ముత్యాలమ్మ, సీతీష్, భూలోకరావు, గురుమూర్తి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో టౌన్ కొత్త రోడ్డు దరి ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. నాయకులు ఎం.సుబ్బారావు, కర్రి చంద్రశేఖర్, కె.సంతోష్ కుమార్ పాల్గొన్నారు. పెదవాల్తేరులో జరిగిన కార్యక్రమంలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, నాయకులు చలపతి, వెంకటరావు, కుమారి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు

-రూ.12 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆర్ఐ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. ఏసీబీ డిఎస్ పి ఎన్ రమ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఏసీబీ అధికారులు తహ సిల్దార్ కార్యాలయంలోకి ప్రవేశించి విచారణ చేపట్టారు. సాయంత్రం మూడున్నర గంటలకు ఏసీబీ డిఎస్‌పి రమ్య ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒక రైతు వ్యవసాయ భూములో బోరు వేయించడానికి రెవెన్యూ అధికారుల పర్మిషన్ కోసం నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఇంచార్జ్ ఆర్‌ఐ గా పనిచేస్తున్న ఎం.కన్నబాబును సంప్రదించగా 3 అప్లికేషన్లకు గాను 15 వేలు లంచం డిమాండ్ చేశారని తెలిపారు. 12 వేల రూపాయలకు ఒప్పందం జరిగిందని శుక్రవారం ఉదయం రైతు నుండి 12 వేల రూపాయల నగదు లంచం

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి, (ఇన్‌సెట్‌లో ఆర్ఐ)

తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నట్లు ఆమె వెల్లడించారు. సంబంధిత రైతు రెండు రోజుల క్రితం తమకు ఫిర్యాదు చేశారని, ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. విచారణ కొనసాగుతుందని, శనివారం ఇంచార్జ్ ఆర్ఐ కన్నబాబును రిమాండ్‌కు తరలిస్తామన్నారు. సిఐలు సిహెచ్ లక్ష్మణరావు, పి శ్రీనివాసరావు, బి.సుప్రియ, వైకే కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		